ఈ చీరలో నేను బాగున్నానా?

మధురాంతకం రాజారాం

"ఒసే ముత్యాలూ! ఈ చీరలో నేను బాగున్నానా ?"

'నేను' అనబడేది గనుక బాగున్నట్టయితే, అది ఏ చీరలోనైనా బాగానే వుంటుందని ముత్యాలుకు తెలుసు. కానీ ఈ అభిప్రాయాన్ని స్పష్టంగా మాటల్లో పెట్టడానికి కావలసిన భాషాజ్ఞానం అమెకు లేదు.

ముత్యాలు మద్రిపల్లెలో పుట్టింది. రెండు, మూడేళ్ళు వయసొచ్చేదాకా ఒంటిపైన బట్టన్నమాట లేకుండా తిరిగింది. చిన్నాన్న పెళ్ళికి వాళ్ళనాన్న చీటీబట్టతో ఒక గౌను కుట్టుకొచ్చిన రోజున ఒక పెద్ద రాజ్యానికి తాను దొరసాని అయిపోయినట్టు సంబరపడిపోయింది. ముత్యాలు జీవితయాత్రలో అది మొదటి మజిలీ అయితే, రెండోమజిలీ తనకోసం ఒక పావడా జాకెట్టూ తయారుకావడం. వారానికొకసారి ఈ పావడా జాకెట్టూ చాకలికి వేయవలసినప్పుడు ఆమె చిన్న చీరముక్క ఒకటి శరీరానికి చుట్టబెట్టుకునేది. అలా మరికొంతకాలం గడిచి, అక్కడ ముత్యాలు పావడాపైన ఓణీ వెయ్యవలసిన అవసరం వచ్చేసరికి యిక్కడ పెదరామాపురంలో మేనత్త కొడుకు మంగపతికి ముకుదాడు అత్యవసరమైపోయిందన్న వర్తమానం వచ్చింది. ఇరవై రెండు రూపాయలు పెట్టి మంగపతి

ముహూర్తంచీర కట్టుకుని ముత్యాలు బిస్సెక్కి చక్కా కొత్తకాపురానికి వచ్చేసింది.

మర్రిపల్లెలో ముత్యాలు చీరకట్టుకునే వాళ్ళనైతే చూచిందిగానీ, ఆచీరలో తాము బాగున్నట్టా, లేనట్టా అని వితర్కించుకునేవాళ్ళని చూచి ఎరగదు.

ఇక్కడ పెదరామాపురంలో గూడా ఈ గొడవ అన్ని యిళ్ళల్లోనూ వున్నట్టు లేదు.

పెదబాబుగారి కోడలు శకుంతలారాణి రోజుకు నాలుగైదుసార్లన్నా దుస్తులు మారుస్తుంది చీర మార్చినప్పుడల్లా యిదేప్రశ్న!

"ఒసే ముత్యాలూ! ఈచీరలో నేను బాగున్నానా?"

తలవంచుకుని శనపనేమిటో తాను చేసుకుంటూ "మీకేమండమ్మా! చాలా బావున్నారు" అంటుంది ముత్యాలు.

"ఒసే వెర్రిమొగమా! నా సంగతి కాదే! నా చీర సంగతి?" అంటుంది శకుంతలారాణి!

ముత్యాలు వెనుదిరిగిచూచి "చీర చాలా బాగుందమ్మా! ఎక్కడకొన్నారు?" అని అడిగితే అప్పటికది శకుంతలారాణికి ఆనందం కలిగించే విషయం

"ఎప్పుడు కొన్నారు?" అని అడిగితే ఆమెకు కలిగేది పరమానందం.

యిక బ్రహ్మానందమే!

ఏమీ అడగకపోతే శకుంతలారాణికి నాలుక పెరుక్కోవాలనిపిస్తుంది. జుత్తు పీక్కోవాలనిపిస్తుంది. ఇంకా మాట్లాడితే ఎదుటి మనిషిమైనపడి గోళ్ళతో ముఖం రక్కేయాలనిపిస్తుంది. ఆ వుక్రోషం కొట్టొచ్చినట్టుగా మొహంలో స్పష్టంగానే కనిపిస్తుంది.

ఎందుకు? ఎందుకు?

ముత్యాలుకు సరిగ్గా అర్థంకాదు.

ఒక్కొక్కప్పుడు కాఫీ తీసుకు రమ్మని ముత్యాలుకు పురమాయించి తాను చక్కా మేడమైకి వెళ్ళిపోతుంది శకుంతలారాణి

ముత్యాలు కాఫీగ్లాసుతో శకుంతలారాణిగదిలో అడుగు పెట్టేసరికి ఆగది గదిలావుండదు. ద్రౌపదీవస్త్రాపహరణం తరువాత కౌరవసభలా వుంటుంది.

శ్రీకృష్ణుడు ద్రౌపదికి సప్లయిచేసిన చీరల్లో బహుశా యింతటి వైవిధ్యం కనిపించివుండదు. ఎందుకంటారా? అప్పటికింకా కంచిలో, గద్వాలలో, అలంపురంలో, వెంకటగిరిలో, బొబ్బిలిలో, పుల్లంపేటలో, ధర్మవరంలో, మాధవవరంలో ఈ విధంగా యిన్నిరకాలచీరలు తయారుకానేలేదు.

"ఒక్కొక్క చీరగా మడచి పెడతావా ముత్యాలూ? నేను బీరువాలో సర్దేస్తాను" అంటుంది శకుంతలారాణి.



"అలాగే నందమ్మగారూ!" అంటుంది ముత్యాలు.

చీరలు మడిచిపెడుతూ ముత్యాలు ఆలోచనలో పడుతుంది. దండిగా చీరలున్నాయిగదా అని ఎవరైనా ఒక్కసారిగా నాలుగైదుచీరలు ఒంటికి చుట్టుకుంటారా? ఊహూఁ, అదేం కుదరదు. మరైతే ఒక మనిషికి యిన్ని చీరలెందుకు? పెట్టెలో మ్రగ్గిపోవడానికా? లేదంటే చివరకు చిమటలు తినిపోవడానికా?

హఠాత్తుగా ఆలోచన కట్టుతగులుతుంది శకుంతలారాణి. "ఇదేం చీరో ఎరుగుదువా ముత్యాలూ?" అంటుంది.

ఆ చీరకేసి తేరపారజూచి "ఇదా! ఆరోజు కరణం కామప్పగారింట్లో పేరంటానికెళ్ళినరోజున మీరు కట్టుకు..దిదే కదండీ" అంటుంది ముత్యాలు

కరణం కామప్పగారింట్లో పేరంటం జరిగి మూడు మాసాలై వుంటుంది. ఇంకొక మూడు నెలలకుగానీ తానీ చీర కట్టకపోవచ్చు. తనకెన్ని చీరలున్నాయో లోకులకు తెలియడానికి ఈ నిదర్శనం ఒక్కటిచాలు. కానీ ఆశ్చర్య మేమిటంటే ఈ లోకులనేవాళ్ళకు తన చీరల వైభవాన్ని గురించి బొత్తిగా కాబట్టినట్టు లేదు. ఇందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేనట్టు, అప్పటికది చాలా మామూలు విషయమైనట్టు వీళ్ళు ముభావంగా వుండిపోతారు. ఈ లోకుల్లో అగ్రస్థానం

తనకు కట్టుకోడానికి ముహూర్తం చీరతో సహా కలిపి లెక్కపెట్టినా నాలుగైదింటి కన్నా ఎక్కువలేవుగదా! మరైతే దేన్ని చూచుకునమ్మా దీనికింత బింకం? కించిత్తు అసూయ కనబడదే! కాస్తా అసహనం ప్రకటించదే! ఇదేం మొద్దు మనిషమ్మా ఈ ముత్యాలు?

చీరలు మడతపెడుతూ అప్పుడప్పుడూ తల పైకెత్తి శకుంతలారాణి వైపు చూస్తుంది ముత్యాలు చాలా అందమైన ముఖం శకుంతలారాణిది! పొంకమైన ఒళ్ళు. పొడుగాటి కురులు పోతే ప్యూట కొకరకంచీరతో ముస్తాబవుతుండిగూడా! ఇలాంటి అందమైన మనిషి మనసంతా విప్పి, హాయిగా ఒళ్ళు జల్లుమనేలా ఒకసారి నవ్వేస్తే చూడాలన్న కోరిక ముత్యాలుకు తీరకుండానే వుండిపోయింది. కంచిపట్టుచీర సునాయాసంగా కొనగలిగిన మనిషికి కాస్తంత చిరునవ్వు దొరక్కపోయిందా? ఒక చీర కొనడం మానేసి ఆ డబ్బుపెట్టి ముఖం కలకలలాడే మందేదైనా వుంటే కొనుక్కోగూడదా? వీళ్ళకు మేడలున్నాయి తోటలున్నాయి. కారుంది కొళాయి తిప్పితే నీళ్ళొస్తాయి. మీటనొక్కితే పంకా తిరుగుతుంది. మీట త్రిప్పితే రేడియో పాటందుకుంటుంది ఐనా ఎన్నివుండి ఏంలాభం? చిన్నమ్మగారి ముఖం విప్పారిన పువ్వు. ఆమె మేడలో మసిలే నీడ!

ముత్యాలు మేనత్త బంగారమ్మ పెదబాబుగారింట్లో పని చేస్తూవుండేది. కొత్త కోడలు కాపురానికి రాగానే ఆమె తనంతట తానుగా రిటయిరైపోయి, ఆ వుద్యోగాన్ని ముత్యాలుకు అప్పజెప్పింది. చిన్నప్పటినుంచీ ఒళ్ళువంచి పనిచేయడానికే అలవాటుపడిన ముత్యాలుకు పెదబాబుగారింట్లో పనిచేయడ మేమంత కష్టసాధ్యంగా కనిపించడంలేదు. ఆమెకు విడ్డూరంగా వున్నదల్లా యిక్కడి మనుషుల వాలకమే! ఐనా పెద్దవాళ్ళవూసు మనకెందుకు లెమ్మన్నట్టుగా ఆమె వాళ్ళ మధ్య వీలయినంతవరకూ ఒక మూగ పాత్రగానే వుండిపోయింది. ఐతే అలాంటి ముత్యాలుగూడా ఒక సందర్భంలో ఒళ్ళు మరిచిపోయే పరిస్థితి ఏర్పడింది

ఒళ్ళు మరిచినప్పుడు మనిషినోటి గుండావచ్చినమాట ఎలాంటి తీవ్రపరిణామానికైనా దారితీస్తుంది.

అసలిక్కడ ఏం జరిగిందో చెప్పాలి.

సంకురాత్రి కింక వారంరోజు లుండగా శకుంతలారాణి "పండగకు నువ్వు కొత్తచీర కొనుక్కోలేదా ముత్యాలూ?" అని అడిగింది.

ముత్యాలు సిగ్గుపడిపోయింది. పెళ్ళిపీటలపైన తనకు నాతీసుచీర కొనిపెట్టనందుకు మంగపతిని బంధువులందరూ తలా ఒకమాటన్నారు. తన విలువ

తనకు తెలిసివచ్చాక ముత్యాలు గూడా ఆ చీర తాను కట్టనంటే కట్టనని మారాం చేసింది ముద్దరాలి ముచ్చటతీర్చి, మరింతగా మురిపాలు దోచుకోవాలని మంగపతికి గూడా ఒక మంచి బుద్ధి పుట్టింది. అతడెలాగో ఒక యాభై రూపాయలు సంపాదించాడు. టౌనుకు వెళ్ళి నాలు గంగళ్ళు ఎక్కిదిగి, యాభై రూపాయలకు పట్టుచీరలేవీ రావని తెలుసుకున్నాక అతడొక స్నోవైటు చీర తీసుకొచ్చాడు. లేతలేత నీలిమబ్బుల చీర. మబ్బుల వెనుక మెరుస్తూ రంగురంగుల నక్షత్రాలు ఇరుగుపొరుగు అమ్మలక్కలు ఆ చీరలో ముత్యాలు మబ్బుల్లో చందమామలాగుంటుందన్నారు.

ముత్యాలుద్వారా ఈ వర్తమానం తెలుసుకున్న శకుంతలారాణి "ఏదీ, ఒకసారి ఆ చీర తెచ్చి చూపెట్టగూడదా ముత్యాలూ!" అంది.

ఆరోజు సాయంకాలమే ముత్యాలు స్నోవైటుచీర తీసుకునివెళ్ళి శకుంతలారాణికి చూపెట్టింది.

కొత్తచీరవైపు చూడగానే శకుంతలారాణి కళ్ళు మిలమిల మెరిసాయి. ఆమె చీరను తాకి చూచింది. త్రిప్పిచూచింది. పొరలు పొరలుగా విడతీసి శరీరంపైన కప్పుకుని చూచింది. దాని స్పర్శ, రంగు వాసన అన్నీ ఆమెకెంతో యింపితంగా వున్నాయి. తటాలున గదిలోకివెళ్ళి ఆమె క్షణాల్లో చీర మార్చేసుకుంది. నిలువుటద్దంముందు నిలబడి, కొత్తచీరలో తన సోయగం పోతున్న పోకడలన్నీ తనివి తీరా చూచింది. ఈ తతంగమంతా కొనసాగుతూవచ్చిన పదినిమిషాల వ్యవధిలో ఆమె ఈ చీర ముత్యాలుదన్న విషయం మరిచేపోయింది!

ఈ చీర తనదిగాదు ముత్యాలుది. ఆమె వెలుపల నిలబడివుందన్న విషయం జ్ఞప్తికిరాగానే శకుంతలారాణి ఓరబిరా బయటికి పరుగెత్తివచ్చింది

"ఒసే ముత్యాలూ! మంచిదానివి గదూ! నేనొక మాట చెబుతాను, వింటావా? మరేంలేదు నాకెందుకో ఈ చీరను విడిచిపెట్టడానికి బుద్ధి పుట్టడం లేదు. దీని వెలెంత? యాభై రూపాయలా? నే నింకొక నాలుగో, అయిదో ఎక్కువగానే యిచ్చేస్తాను. అంతగా కావలిస్తే, నువ్వింకొక చీర తెప్పించుకోవచ్చు ఏమంటావు ముత్యాలూ! సరేనా? ఉండు, యిప్పుడే డబ్బు తీసుకొస్తాను..."

ముత్యాలు ముఖం ముడుచుకపోయింది. పండుగలోపల మళ్ళీ యిలాంటి చీర కొనుక్కోడం కుదరకపోవచ్చు పట్టణానికి వెళ్ళిరావడానికి భర్త బద్ధకించవచ్చు. తనకింత మంచి చీర తెచ్చిపెట్టినందుకు అత్తగారసలే రుసరుస లాడిపోతూవుంది. ఈసారి ఆవిడ బొత్తిగా ఒప్పుకోక పోవచ్చు.

డబ్బు చేతిలో పెడుతూ "ఏం

ముత్యాలూ! అదేలా వున్నావు? దిగులుగా వుందా?" అంటూపరామర్శించింది శకుంతలారాణి.

"ఏం దిగుల్లేండి అమ్మగారూ! ఎంత పాతచీర కట్టుకున్నా నా మొగుడికళ్ళకు నేను బాగానే ఉంటాను." అని వెనుదిరిగి చూడకుండా గిరుక్కున బయటికి వచ్చేసింది ముత్యాలు!

జరిగిన కథంతా విన్నాడు మంగపతి. కోప్పడవలసింది పోయి, వేడిగా నిట్టూర్చాడు. "అయ్యో, ఎంతపని చేశావు ముత్యాలూ!" అంటూ నొచ్చుకున్నాడు. "అదేం. నేనేం చేశాను మామా?" అంటూ తెల్లబోయింది ముత్యాలు.

మంగపతి వివరించాడు.

శకుంతలారాణికి పెళ్ళయి మూడేళ్ళయింది. భారీ కట్నంతో, బోలెడు చీరలతో, సారెలతో ఆమె కాపురానికి వచ్చింది. అమ్మాయిని చిదిమి దీపం పెట్టుకోవచ్చునని అందరూ అన్నారు. కానీ సట్టింట వెలిగే దీపం కన్నా, చినబాబుకు వీధిదీపాలంటేనే యిష్టం. గంటకొక కాఫీ త్రాగి, నోరు చేదెక్కిన వాడికి కమ్మటి మజ్జిగ రుచిస్తుందా? ఇంటిపట్టున పడివుండి ఎప్పుడూ తనకోసం ఎదురుచూచే పెళ్ళామంటే చినబాబుకు చెప్పరానంత తలనొప్పి! అతని నివాసం హమేషా పట్టణంలోనే! అక్కడతని వ్యామోహాలకు ధూప దీప నైవేద్యాలు సమర్పించే స్నేహితులు దండిగా వున్నారు. స్థిరంగా ఒక బస వుంది. ఆ బసలో తన యిష్టం వచ్చినట్టు తాము ఉండడానికి కావలసిన వసులుబాట్లన్నీ వున్నాయి...

"చిన్నమ్మ గారికేం మిగిలింది? బీరువా నిండుకూ చీరలు మిగిలాయి. కళ్ళనిండుకూ కన్నీళ్ళు మిగిలాయి. చాలనిదానికి పుండుమీద కారం చల్లడానికి నువ్వొకదానివి బయల్దేరావు" అన్నాడు మంగపతి.

ముత్యాలు కొయ్యబొమ్మలా మాన్పడిపోయింది.

పది రోజులు గడిచాయి. ఈ పది రోజుల్లో చిన్నమ్మగారి ఔదార్యం పెదరామాపురంలో యింటింటా చెప్పుకోదగ్గ విషయమైపోయింది. నాకు వాయిల్ చీర యిచ్చిందని ఒకరంటే, నాకు ఫుల్ వాయిల్ చీర యిచ్చిందని ఒకరు, మా అమ్మాయికి రెండు చీరలిచ్చిందని ఒకరంటే, నా కోడలికి మూడు చీరలని యింకొకరు. ఈ చీరలదానం చివరికెక్కడికి దారి తీస్తుందో ఎవరికీ అంతు చిక్కడంలేదు.

చిన్నమ్మగారు పుట్టింటికి వెళ్ళబోతున్నట్టు మాత్రం అక్కడక్కడా చెప్పుకున్నారు

అత్తింట కాపురం చేస్తున్న కోడళ్ళు పుట్టింటికి వెళ్ళిరావడం సహజమే! శకుంతలారాణి పుట్టింటికి బయల్దేరడంలో గూడా వైపరీత్యమని చెప్పుకోదగ్గదేదీ



కనిపించలేదు. కానీ ఆమె వెళ్ళి చేరినట్టు పుట్టింటినుంచీ వార్త రాకపోవడం యిక్కడివారికి కాస్తా ఆశ్చర్యం కలిగించింది. వారంరోజులు ఓపిక పట్టి పీశ్శాక టెలిగ్రాం యిచ్చిచూచారు. టెలిగ్రాముకు బదులుగా ఒక మనిషి పరతెంచి వచ్చాడు. శకుంతలారాణి అక్కడికి వెళ్ళనేలేదట. ఈ వర్తమానం తెలియగానే పెదబాబుగారిల్లు కుమ్మరావంలా ఒక వరస లోలోపలే వుడికిపోయింది.

సీతామ్మ వారికోసం జరిగినట్టుగా నాలుగు దిక్కులకూ అన్వేషణ ప్రారంభమైంది.

ఎలాంటి అశుభవార్త వినవలసి వస్తుందోనని శ్రేయోభిలాషులందరూ గుండెలు గుప్పిట్లో పట్టుకుని వేచివుండిపోయారు. ఇంకా నయం ! వచ్చింది అశుభవార్తగాదు కానీ శుభవార్తగా భావించడానికి వీల్లేదు. శకుంతలారాణి ఉద్దేశమేమిటో ఆదేవుడికే తెలియాలి. ఆమె చినబాబు ఏ పట్టణంలోనైతే స్థిరంగా మకాంపెట్టి తననివాసకేంద్రాన్ని నెలకొల్పుకుని వున్నాడో ఆదేపట్టణంలో ఒక బంధువుల యింట మకాంచేసిందట! ఆచూకీ కనిపెట్టిన పెదబాబుగారి మనిషి వెళ్ళిపిలిస్తే రావడంలేదు పొమ్మని చీవాట్లు పెట్టిందట !

చినబాబు కోపదంధ హ్యామాస మానసుడై పోయివుంటాడని ప్రత్యేకంగా

ఒప్పుకోల్లేదు. అలాడు గంటకు అంపై మైళ్ళస్పీడులో-నడచి కాదు, కారులోనే అనుకోండి, వెళ్ళి ఆబంధువులయింట్లో వ్రాలాడు. ఆభార్యాభర్తల సమాగమానికి ప్రత్యక్ష సాక్షు లెవరూలేరు. లేదంటే చాటునమాటున నిలబడి వాళ్ళప్రసంగాన్ని ఎవరైనా వినివుంటే వినివుండవచ్చు- అలాంటి వాళ్ళద్వారా శకుంతలారాణి వాదమేమిటో తెలుసుకోడానికి వీలయింది.

అమ్మాయి ఎక్కడో పుట్టిపెరుగుతుంది ఆత్మీయుడనినమ్మి ఒక మగరాయుడి వెంటవచ్చేస్తుంది యువతీయువకులిద్దరు ఒక కప్పు క్రింద సహజీవనం నెరపడానికి యిష్టపడుతూ చేసుకునే ఒప్పందమే వివాహం. మొగుడైన వాడికి తనకు భార్యంటూ ఒక మనిషివుందన్న స్పృహే లేకపోయిన తర్వాత యింక ఆ ఒప్పందం తగలబడినట్టే ! అలాంటి పరిస్థితిలో భార్యకు రాజభోగాలు జరిగితే జరగవచ్చునుగాక ! కానీ అదంతా మొదటి తరగతి ఖైదీ జీవితంకన్నా మెరుగైందేమీ కాదు. బోలెడు చీరలుండొచ్చు. ఒంటినిండుకూ నగలుండవచ్చు కానీ తన వ్యక్తిత్వానికి విలువలేక పోయాక, తన ఆత్మాభిమానం దివాలా తీశాక అవన్నీ శవానికి చేసిన అలంకారాలు. తల్లిదండ్రుల పుణ్యమా అని తను కొంతవరకూ చదువుకుంది. ఆమాత్రం చదువుకు ఏదైనా వుద్యోగం దొరక్కపోదు. ఒకరిపైన ఆధారపడకుండా, ఒకరి మహార్భానీ అక్కర్లేకుండా తన బ్రతుకేదో తాను బ్రతుకుతుంది.

పాపం చినబాబు తన జనానాలో యిలాంటి తిరుగుబాటు చెలరేగుతుందని కలలోనైనా వూహించివుండడు.

ఐనా యిదంతా పాలపొంగు లాంటిదేననీ, తల తిరిగి కవళం నోటిదగ్గరికి రాకపోదనీ అతడు భావించివుండవచ్చు.

మొత్తానికీ అనదమేగాదు. అన్నంత పని గూడాచేసింది శకుంతలారాణి. ఆమెకెక్కడో ఒక వుద్యోగం దొరికింది. చిన్నసంపాదనే ! కానీ ఆమె సంసారం మాత్రం ఏపాటిది ? ఒంటి మనిషి ఇంటద్దెకు యాభైరూపాయలు పోతుంది. మిగిలిన అవసరాల కన్నింటికీ కలిసి వందరూపాయలు సరిపోతుంది. పోగా ఆమె నెలసరి జీతంలో యింకా యాభై రూపాయాలు మిగిలేవుంటాయి.

కాలినడక పైన ఆఫీసుకు వెళ్ళివచ్చే భార్య కారుపైన రోడ్లలో బలాదూర్లు తిరిగే భర్త, ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట ఆ భార్యాభర్తలు ఒకరికొకరు తారసిల్లడం అసంభవమేమీ కాదు. ఒకసారి అదే జరిగింది. శకుంతలారాణి ఆఫీసుకువెళ్తుండగా ఓ కారు సవ్వడిచేయకుండా వచ్చి ఆమె ప్రక్కన ఆగిందట ! విండోలోనుంచీ వెలుపలికి చూస్తూ చినబాబు "ఇది నీకు

యువ



గౌరవప్రదంగా వుందా ?" అని ప్రశ్నించాడట !

"నేనిలా ఆఫీసుకు వెళ్తుండడం గౌరవ ప్రదమే ! మీరు కారులో తిరగడమూ గౌరవ ప్రదమే ! కానీ మనం యిక్కడ ఆగి ఒకరితో ఒకరు యిలా మాట్లాడుకోవడం మాత్రం గౌరవప్రదం కాదు" అంటూ శకుంతలారాణి చరచరా తన దారివెంట తాను వెళ్ళిపోయిందట.

ఇంకొకసారి తెంపుచేసి, చినబాబు శకుంతలారాణి కాపురమున్న యింటికే వెళ్ళాడట. రాత్రి తొమ్మిగంటల వేళ అతడు దబదబా తలుపు బాదాడు. "ఎవరక్కడ?" అని ప్రశ్నిస్తూ కిటికీ తలుపులు తెరిచింది శకుంతలారాణి. "నేనే గానీ ఒకసారి తలుపు తీస్తావా ?" అన్నాడు భర్త. "ఎందుకూ !" అంటూ ఆశ్చర్యం ప్రకటించింది భార్య.

"నీతో ఒకమాట మాట్లాడాలి ?"

"అక్కడుండే మాట్లాడగూడదూ ?"

"తీస్తావా ? తలుపులు బద్దలు చెయ్యమంటావా ?" అంటూ హుంకరించాడట చినబాబు

శకుంతలారాణి నవ్విందట ! "తలుపులు తెరచిపెట్టుకుని, మీకోసం కాచుకుని కూచున్నప్పుడు మీరు రాలేదు. ఇప్పుడు పదిలంగా గడియపెట్టుకుంటే తలుపులు బద్దలుగొడతా మంటున్నారు. లోకమంతా మీతోడిదేనని అనుకున్నప్పుడు, మీకు నేనొక్కత్తిని వున్నానన్న ఆలోచనే కలగలేదు ఒకరిపైన ఆధారపడకుండా నేను బ్రతకగలనని నిరూపణ అయిన తర్వాత మీకు నాపైన ఎక్కడలేని ధ్యాస పుట్టుకొచ్చింది." అంటూ ఎద్దేవాచేసిందట !